క్లుప్తంగా

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాసులు

మదనపల్లె సిటీ: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 4,5, తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి గౌస్‌బాషా తెలిపారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అర్హతలున్న చిన్నారులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://ఏపీ స్పోర్ట్స్ స్కూల్. ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఈనెల 19వతేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.ఈనెల 20 నుంచి 25వతేదీ వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ లిస్టు జారీ చేస్తారన్నారు. జూలై 1 నుంచి 3వతేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంపికకు ఒరిజనల్ పత్రాలతో హాజరుకావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైనవారు ఈనెల 10,11 తేదీల్లో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించే ఎంపికకు హాజరుకావాలన్నారు. అవకాశాన్ని జిల్లాలోని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

మదనపల్లె రూరల్ : మండలంలోని వలసపల్లె పంచాయతీ కేంద్రీయ విద్యాలయంకు కేటాయించిన స్థలానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు చేస్తున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వలసపల్లె సర్వేనెం.816/1, 2లోని స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినదని, ఇందులో అనధికారికంగా నిర్మాణాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆర్ఐ భరత్‌రెడ్డి, వీఆర్వో నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆక్రమణ స్థలంలో రెవెన్యూశాఖ అధ్వర్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. నీటిప్రవాహ పొరంబోకులు, ఆక్షేపణీయ ప్రభుత్వ భూముల్లో ఎటువంటి ఆక్రమణలు జరపరాదన్నారు. ఆక్రమణ చేసిన వ్యక్తులపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

చదువులో ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా

మదనపల్లె సిటీ: విద్యార్థులు చదువులో ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా చేయాలని ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఉల్లాసంగా ,ఉత్సాహంగా ఉంటారన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

పీలేరు రూరల్ : బాల కార్మికుల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని లేబర్ ఆఫీసర్ జగదీష్‌బాబు అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలో వివిధ ప్రాంతాలలో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యానేరమన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీరు గట్టప్ప, సీఆర్పీ మురళీధర్‌రాజు పాల్గొన్నారు.

సింహ వాహనంపై నారసింహుడి చిద్విలాసం

కలికిరి: కలికిరిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా మూడవ రోజు బుధవారం సతీసమేతంగా లక్ష్మీనరసింహస్వామి సింహ వాహనంపై పురవీధులలో విహరించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు మునుపు ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారు పల్లకీలో ఊరేగారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం హనుమంత వాహనంపై స్వామి వారిని ఊరేగించనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఫోర్డు డైరెక్టర్ జిల్లా లలితమ్మ అన్నారు. బుధవారం మదనపల్లె పరిధిలోని టీఎస్ఆర్ కాలనీ, బుగ్గకాల్వ, బసిని కొండ కాలనీల్లో పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కల పెంపకం, వాటి ఆవశ్యత, పరిరక్షణ గురించి పిల్లలను అవగాహన కల్పించారు. పంటలు, మార్కెటింగ్ విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది నరసింహ, జయలక్ష్మి, స్వర్ణ, జలజ, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

తంబళ్లపల్లె: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే పనులు చేపట్టాలని సీఆర్‌డిపి టెక్నికల్ సభ్యులు సునిల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. పలు చోట్ల ఫారంఫాండ్ పనులను పరిశీలించారు. తంబళ్లపల్లెలో చారిత్మాతక కోనేరు పునః నిర్మాణం చేపట్టేందుకు పరిశీలించారు. అనంతరం స్త్రీ శక్తిభవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

- సంవత్సర కాలంలో ప్రజలకు చేసింది శూన్యం
- కాల్‌బ్యాక్ ఆప్షన్ ఉంటే అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ
- సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : చంద్రబాబు ప్రభుత్వంపై తొలి ఏడాదిలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు... పార్టీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పట్టణంలోని చిత్తూరు బస్టాండ్ బీటీ వెల్‌కంహోం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన నిరసన ప్రదర్శనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూపర్‌సిక్స్ హామీలు ఎక్కడ..? లక్షల ఉద్యోగాలు ఎక్కడ..? ఉచిత ఆర్టీసీ బస్సు ఎక్కడ..? నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఎక్కడ..ఎక్కడ అంటూ నినాదాలు చేస్తూ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓ రాఘవేంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...చంద్రబాబు ఏడాది పాలనలో వ్యవస్థలు అన్నీ సర్వనాశనం అయ్యాయన్నారు.

జూన్ 4 రాష్ట్ర చరిత్రలో చీకటిదినం :

జూన్ 4 రాష్ట్ర చరిత్రలో చీకటిదినంగా ఆయన అభివర్ణించారు. సరిగ్గా ఏడాదిక్రితం బాబు అబద్ధపుహామీలను నమ్మి ప్రజలు ఏమారి కూటమిప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే..అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా పసికందులు, ఆడపిల్లలపై అఘాయిత్యాలు, విచ్చలవిడి గంజాయి, నాటుసారా అమ్మకాలతో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్ట్‌షాపులు, ఇసుకదోపిడీ అధికమైందన్నారు. ప్రజలకు కాల్‌బ్యాక్ ఆప్షన్ ఉంటే... కచ్చితంగా కూటమిప్రభుత్వాన్ని వద్దని, తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చుకునే పరిస్థితి ఉందన్నారు.

వలంటీర్లు, ఎండీయూల జీవితాలు రోడ్డుపాలు

యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోగా, వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు...ఇలా లక్షల సంఖ్యలో ఉద్యోగస్తులను తొలగించి, కుటుంబాలను రోడ్డుపాలు చేసిన ఘనత కూటమిప్రభుత్వానికే దక్కిందన్నారు. టమాటా, మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని, పెట్టుబడి సాయం అందక, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితి తలెత్తుతోందన్నారు. చివరకు దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగి, పవిత్రమైన తిరుమల లడ్డూ విషయంలోనూ నీచరాజకీయాలు చేసిన సంస్కృతి చంద్రబాబుది అన్నారు. కడపలో మహానాడు పెడితే హీరోయిజం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి, వారి నమ్మకాన్ని నిలుపుకోవాలన్నారు. ప్రజలపక్షాన ఎప్పటికప్పుడు కూటమిప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటామని, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, ఆర్ఐ.రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఆర్ఐ.దండుశేఖర్‌రెడ్డి, దండు కరుణాకర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర, కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, నందినితాజ్, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, బోర్‌వెల్‌మహేష్, లియాఖత్ అలీ, ఎస్.ఏ.కరీముల్లా, గుండ్లూరురఫీ, డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి, బాలగంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కోటూరి ఈశ్వర్, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, ఈశ్వర్‌నాయక్, ప్రసాద్‌బాబు, ఎస్వీ.రమణ, శీలంరమేష్, దండురామాంజులు, నరిబాబాయ్, ఇర్ఫాన్, గార్లచంద్రమౌళి, జీవీ.ప్రసాద్, కోళ్లబైలు అనిల్‌రెడ్డి, చిప్పిలి జగన్నాథరెడ్డి, బావాజాన్, వెంకటరమణ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శారదారెడ్డి, జయంతి, రోలింగ్‌మల్లిక, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో వెన్నుపోటు దినం నిరసన ప్రదర్శన ర్యాలీ



పీలేరులో వెన్నుపోటు దినం నిరసన ప్రదర్శన ర్యాలీ

ప్రజా విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం

పీలేరు : అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ వైఫల్యంపై వెన్నుపోటు దినం కార్యక్రమం నిరన్వహించారు. స్థానిక మదనపల్లె మార్గం బోదేషావలి దర్గా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ నలు మూలల నుంచి వేలాది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. తహసీల్దార్ భీమేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సూపర్‌సిక్స్ పేరుతో హామీ గుప్పించి అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించిందని తెలిపారు. జగన్ కంటే ఎక్కువ పథకాలు, ఎక్కువ అమలు చేస్తామని మోసపూరితమైన మాటలు చెప్పి పూర్తి చేతులెత్తేసిందని తెలిపారు. బస్సుల్లో ఫ్రీ, అమ్మకు వందనం, నిరుద్యోగ బృతి అంటూ అనేక హామీ గుప్పించి విస్మరించిందన్నారు. సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించి వేధిస్తున్నారని తెలిపారు. తద్వారా కూటమి ప్రభుత్వం స్వల్ప కాలంలోనే ప్రజాదరణ కోల్పోయిందని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా భయపడే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా, జగన్‌ను సీఎం చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నాయకులు సుధీర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మహిత, దండు జగన్‌మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, ముక్తియార్ అహ్మద్, శివారెడ్డి, హబీబ్‌బాషా, చంద్రారెడ్డి, చక్రధర్, షాకీర్, నారే వెంకటరమణారెడ్డి, అమరనాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్టాంపుల నరసింహారెడ్డి, చెంగల్‌రాయుడు, భానుప్రకాష్‌రెడ్డి, జయరామచంద్రయ్య, లోకనాథరెడ్డి, ఉదయ్‌కుమార్, కలీమ్, ఆనంద తదితరులు పాల్గొన్నారు.



వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నిరసన తెలుపుతున్న నాయకులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తునన మాజీ ఎమ్మెల్యే చింతల, నాయకులు



కలకడ నుంచి పీలేరుకు తరలివెళ్తున్న నాయకులు

గంగమ్మ తల్లీ.. చల్లంగ చూడమ్మా

మదనపల్లె సిటీ: కోరిన కోర్కెలు తీర్చే కోర్టులో గంగమ్మ జాతర బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక కోర్టు ఆవరణంలో కుమ్మర శ్రీరాములు వంశస్థులు తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకుని ప్రతిష్ఠించారు. మొదట రాటకొండ కుటుంబీకులు కల్లుకుండకు తీసుకువచ్చి పూజలు చేశారు. వంశపారంపర్యంగా వస్తున్న అనవాయితీ ప్రకారం మొదటి పూజ జోశిపాలెం వంశస్తులు నిర్వహించి అమ్మవారికి సారెను సమర్పించారు. అమ్మవారి విశ్వరూప దర్శనం కనుల పండువగా జరిగింది. అమ్మవారి ఆలయంలో విశ్వరూప దర్శనం ఏర్పాటు చేశారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే జరిగే విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పట్టణ వీధులు, ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఎగబడి దర్శించుకున్నారు. పొంగళ్లు, పిండి వంటలను తయారు చేసిన దీపాలతో అమ్మవారికి చెల్లించారు. అమ్మవారికి కిరీటంతో పాటు బంగారు ఆభరణలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం సాధారణ క్యూలతో పాటు, రెండు వీఐపీ క్యూలు ఏర్పాటు చేయగా, ఆలయ ప్రాంగణంలో భక్తులు కోళ్లు, అమ్మవారికి వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు,సారె చెల్లించి అమ్మవారికి దర్శించుకున్నారు. స్థానిక అమినేని వీధి, రాటకొండ వీధుల్లోని అమ్మవారి ఆలయాల్లో గంగమ్మలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మార్పురి చిన్నరెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, రంగస్వామి, కరుణకార్,దేవేంద్ర, భవానీ ప్రసాద్, మార్పురి మల్లికార్జుననాయుడు, చెన్నారెడ్డి తదితరులు జాతరను పర్యవేక్షించారు. మదనపల్లె డీఎస్పీ మహేంద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. వన్‌టౌన్ సీఐ ఎరిసాలివల్లి, ఎస్.ఐ బందోబస్తును పర్యవేక్షించారు.



గంగమ్మ ఆలయం ముందు పూజలు చేస్తున్న భక్తులు

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె రూరల్ : సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా చూడు గంగమ్మ తల్లి అంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ వేడుకున్నారు. బుధవారం మదనపల్లెలో జరుగుతున్న వెన్నుపోటు దినం నిరసనకు ముఖ్యఅతిథిగా హాజరైన శ్యామల, కార్యక్రమం అనంతరం నిసార్ అహ్మద్‌తో కలిసి కోర్టులో గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వారు మీడియాతో మాట్లాడుతూ..కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, మహిమ కలిగిన తల్లి గంగమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ దండుశేఖర్‌రెడ్డి, మహేష్, శారదారెడ్డి, కొత్తపల్లె మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన 'అర్జున తపస్సు'

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం అర్జున తపస్సు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహాభారత యజ్ఞ ప్రాంతంలో తపస్మాన్ ఏర్పాటు చేశారు. ద్రౌపతి సమేత పాండవులు, శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి భక్తి శ్రద్ధలతో తపస్మాన్ వద్దకు తీసుకు వచ్చారు. తపస్మాన్ వద్ద అర్జునుడు, శివపార్వతుల వేషదారులు, యజ్ఞ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున వేషదారుడు కౌరవులపై విజయం సాధించడానికి శివున్ని మెప్పించి పశుపదార్థం సాధించే తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అర్జునుడు ఒక్కో మెట్టు ఎక్కుతూ పాడిన పద్యాలు భక్తులను కట్టిపడేశాయి. అర్జున వేషదారి తపస్మాన్ పైకి ఎక్కి అక్కడి నుంచి నిమ్మకాయలు, వివిధ రకాల పండ్లు, విబూది, మిఠాయిలు విసిరారు. అవి దక్కిన వారికి శుభం కల్గుతుందనే నమ్మకంతో భక్తులతో వాటికోసం పోటీ పడ్డారు. సంతానం లేని మహిళలు, కోర్కెలు కల్గిన భక్తులు తపస్మాన్ వద్ద వరపడ్డారు. అర్జున తపస్సు కార్యక్రమానికి ఉభయదారులుగా పీవోపీ రాజేంద్రనాయుడు, వెంకటేశ్వర్‌రావు వ్యవహరించారు.



అర్జుని తపస్సుకు హాజరైన ప్రజలు

వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య

మదనపల్లె: మున్సిపాలిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేల వేతనం అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లెలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం జరిగింది. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లోని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను ఇవ్వాలన్నారు. సరెండర్‌లీవ్, ఇతరా సౌకర్యాలను అందించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనం పెంచాలన్నారు. మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు పనిభారం తగించాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సాంబశివ, సలీంబాషా, శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ముబారక్, తిరుమల, మస్తాన్, నారాయణ, ఇంద్రాణి, జానకి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- జెండాలు, జగన్ నినాదాలతో దద్దరిల్లిన ములకలచెరువు
- వేల సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- కూటమి ప్రభుత్వంపై ప్రతిబింబించిన ప్రజా వ్యతిరేకత
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిరసన

బి.కొత్తకోట: కూటమి ప్రభుత్వం హామీల మోసానికి ఏడాదైన సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ప్రజాగ్రహం పెల్లుబికింది. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా వేల సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్టీ జెండాలతో కదం తొక్కారు. వీరికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల నుంచి వివిధ మార్గాల నుంచి తరలివచ్చిన శ్రేణులు, వాహనాలతో ములకలచెరువు టీటీడీ కళ్యాణమండపం వద్దకు చేరుకున్నారు. దీనితో ఈ ప్రాంతం కిటకిటలాడింది. తర్వాత ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శ్రేణులు, ప్రజలతో కలిసి ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి బయలుదేరారు. జెడ్పీహైస్కూల్ వద్ద ఎస్, సీఐలు ప్రదర్శనలో ఐదుకు మించి వాహనాలకు అనుమతి లేదని చెప్పడంతో కొంతసేపు ప్రదర్శన ఆగిపోయింది.

దీనితో జై జగన్, జై ద్వారకనాథరెడ్డి నినాదాలతో హోరెత్తించారు. అక్కడినుంచిన తిరిగి ప్రారంభమైన ప్రదర్శనతో రహదారి నిండిపోయింది. మూడు రోడ్ల కూడలికి రాగానే జనసందోహంతో ముంబై-చెన్నై జాతీయరహదారి కిక్కిరిసిపోయింది. నిరసన ప్రదర్శనకు రోడ్డుకు ఒకవైపు మీదుగా వెళ్ళేందుకు పోలీసులు నిర్ణయించడంతో ఆ మార్గంలో వెళ్లారు. టిటీడీ కళ్యాణ మండపం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్లు ప్రదర్శన సాగింది. తర్వాత తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నేతలు వినతిపత్రం అందించారు.

ప్రజా వ్యతిరేకత ప్రస్ఫుటం

ములకలచెరువు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ప్రస్ఫుటమైంది. వెన్నుపోటు నిరసన దినం కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి అనూహ్య స్పందన లభించింది. నిరసన కార్యక్రమాల్లో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు రెడ్డిశేఖర్‌రెడ్డి, పప్పు రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, పాగొండ ఖలీల్, ప్రదీప్‌రెడ్డి, చౌడేశ్వర, మల్లికార్జున, మొహమూద్, శివన్న, పూర్ణిచంద్రిక, డీఆర్.ఉమాపతి, ఫిరోజ్‌ఖాన్, ఎంజీ.భూదేవి, రెడ్డికుమారి, మధుసూదన్ రెడ్డి, గుర్రం రమేష్, బలరాంరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, చాంద్‌బాషా, విశ్వనాథ్, నక్కా రమాదేవి, పద్మజ, అన్సర్‌బాషా, రాంబాబు, డ్రిప్ రమణ, శంకర, భీమగాని నాగిరెడ్డి, సురేంద్రనాథ్, వలసపల్లె రవి, కరీం, సుధాకర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామ్మూర్తి, శ్రీరాములు, కులదీప్‌రెడ్డి, కిషోర్, ఖాదర్‌వలీ, రెడ్డిహారి, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, నాయకులు



బి.కొత్తకోట: నిరసన కార్యక్రమానికి తరలిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

తంబళ్లపల్లె: ప్రజా సమస్యలపై స్పందించి సకాలంలో పరిష్కరించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. గత సోమవారం పలువురు రైతులు ఆర్ఐ ముద్దుకృష్ణ సమస్యలు పట్టించుకోలేదని కాలయాపన చేస్తూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై పత్రికల్లో వార్త ప్రచురితమైంది. స్పందించిన సబ్ కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రైతులు, రెవిన్యూ అధికారులు ,సిబ్బందిని విడివిడిగా విచారించారు. రెవిన్యూ సంబంధింత మేజర్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లును సకాలంలో వారికి అందజేయాలన్నారు. ఇకపై ప్రజల నుంచి ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.